www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 మార్చి 2025

5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



లంక గ్రామాల రహదారిని ఆధునికీకరించాలి

ప్రజాశక్తి -మామిడికుదురు

పాశర్లపూడి నుంచి వయా బి.దొడ్డవరం మీదుగా పెదపట్నం లంక ఆర్అండ్ బి రహదారిని ఆధునికీకరించాలంటూ ఎంపిటిసి సభ్యుడు కొమ్ముల జంగమయ్య డిమాండ్ చేశారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కుసుమ వనజ కుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏప్రిల్ లో రహదారి ఆధునీకరణ పనులు ప్రారంభించే అవకాశం ఉందని ఆర్ అండ్ బి ఎఇ సురేష్ తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతల నేపధ్యంలో తాగునీటి సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, మండల సర్పంచ్ సమాఖ్య అధ్యక్షులు జాలెం రమణకుమారి, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలపై పోరాటం

ప్రజా చైతన్య యాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, తాళ్లరేవు

స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలంతా పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో రెండు రోజులపాటు సాగిన ప్రజాచైతన్య యాత్ర శనివారంతో ముగిసింది. రెండు రోజుల పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఈ సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. మండలంలో పలుగ్రామాల్లో పర్యటించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మరికొంత మంది స్వయంగా సిపిఎం బృందం వద్దకు వచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు.

శనివారం తాళ్లరేవు మండలం సీతారామపురం నుంచి యాత్ర ప్రారంభమైంది. మాధవరాయునిపేట, రెడ్డివారిపేట, పోలేకుర్రు, తోటపేట, తూర్పు పేట, పి.మల్లవరంలో చిన్నపేట, గ్రాంటు, నీలపల్లి తదితర గ్రామాల్లో యాత్ర సాగింది. మాధవరాయుని పేటకు చెందిన టి.ఆదిలక్ష్మి కుందర్తి చిట్టెమ్మ, కె.లక్ష్మి నాగలక్ష్మి మాట్లాడుతూ డ్రైనేజీ, రహదారులు, కొళాయిలు లేవని తెలిపారు. తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామన్నారు. 30 ఏళ్లుగా 60 ఎకరాల రాణి గారి భూములను సాగు చేస్తున్నప్పటికీ నేటికీ పట్టాలు ఇవ్వలేదని సాగు చేసుకుంటున్న దున్నా కొండబాబు, కస్సేటి లక్ష్మణరావు తదితర రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పట్టాలు ఇప్పించాలని కోరారు. సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నామని పోలేకుర్రు పంచాయతీ తూర్పు పేట రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడి పెట్టామని తెలిపారు. మురుగునీరు పారక దుర్వాసనలో జీవిస్తున్నామని పి.మల్లవరం చినపేటకు చెందిన రామకృష్ణ, దడాల ఉమామహేశ్వరం, బర్ల తలుపులమ్మ తదితరులు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం మల్లవరం మీదుగా గ్రాంటు గ్రామం వెళ్లే కాలువను పక్కి గొంది వంతెన వద్ద శ్రీనివాసరావు పరిశీలించారు. కొళాయిలు లేక తాగునీరు అందట్లేదని పోలేకుర్రు పంచాయతీ పరిధిలోని బందవాని కాలనీ వాసులు కొప్పిశెట్టి లక్ష్మి, రాజేశ్వరి, పిల్ల సూర్యకాంతం, పిల్లి లక్ష్మి తెలిపారు. ఇక్కడ 20 ఏళ్లుగా ఇళ్లు ఉన్నాయని, నాన్ లేఅవుట్ కావడం వల్ల సౌకర్యాలు కల్పించలేమని పంచాయతీ అధికారులు చెబుతున్నారని తెలిపారు. అనంతరం నీలపల్లిలోని అమరవీరుల స్థూపానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అనంతరం నీలపల్లిలో దళితుల శ్మశానాన్ని పరిశీలించారు. ముంపు సమస్య నుంచి శ్మశానాన్ని కాపాడాలన్నారు. ఇంజరంలో తాత్కాలిక వంతెనను పరిశీలించారు. దీనివల్ల సాగునీరు సక్రమంగా అందడం లేదని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని స్థానికులు వీరి వెంకట సత్యనారాయణ, సత్తిబాబు తదితరులు తెలిపారు. రత్నవారిపేటను బృందం సందర్శించింది. ఇక్కడితో యాత్ర ముగించారు.

ప్రజా సమస్యలపై ఉద్యమం : వి.శ్రీనివాసరావు

ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని, దీనిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. తాళ్లరేవు మండలంలో సాగునీరు, రోడ్లు, డ్రైయినేజీలు, ముఖ్యంగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వస్తున్నారు తప్ప ప్రజల సమస్యలు పట్టించుకోవట్లేదని విమర్శించారు. స్థానికంగా 10 ఎకరాల అసైన్డ్ భూములున్నా వాటిని పేదలకు పంచడంలో పాలకులు అడ్డుకుంటున్నారన్నారు. రత్నవారి పేటలో మత్స్యకారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. గోదావరిలో కాలుష్యం కారణంగా చేపల వేటకు దూరమయ్యారన్నారు. వారందరూ వలసకూలీలుగా మారిపోయారన్నారు. వెంటనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలన్నారు. స్థానిక సమస్యలపై ప్రజలు పోరాటానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సైకిల్ యాత్రలో సిపిఎం నాయకులు ఎం.రాజశేఖర్, టేకుమూడి ఈశ్వరరావు, కెఎస్.శ్రీనివాస్, సిహెచ్.రమణి, డి.క్రాంతికుమార్, కె.సింహాచలం, టి.రాజా, జగదీశ్వరరావు, మహేష్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



పి.మల్లవరం పంచాయతీ చిన్నపేటలో సమస్యలపై వినతిపత్రాలు అందిస్తున్న స్థానికులు



రత్నవారిపేటలో అధ్వాన్నంగా ఉన్న పారిశుధ్యాన్ని పరిశీలిస్తు...



సైకిల్ యాత్రలో సిపిఎం బృందం



మంత్రి అచ్చెన్నాయుడుకు వినతి అందజేస్తున్న పశు సంచార వాహన ఉద్యోగులు

విధుల్లోకి చేర్చుకోవాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి - అమలాపురం

తొలగించిన 1962 పశు సంచార వాహన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరాం డిమాండ్ చేశారు. పశు సంచార వాహన ఉద్యోగుల జిల్లా సమావేశం శనివారం డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం సిఐటియూ కార్యాలయంలో నిర్వహిం చారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సిఐటియు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి లు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరాం మాట్లాడుతూ కాంట్రాక్టు అయిపోయింది అనే నేపంతో ఉద్యోగులను తొలగించామని చెప్పడం అన్యాయం అన్నారు. వాహానాలను తిప్పకుండా, పశువులకు వైద్యం చేయకుండా ఉండటం ఎంత వరకు న్యాయమని అన్నారు. వెంటనే ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. తదుపరి నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా నూకల బలరాం, అధ్యక్షుడిగా మొగలి మోహన్, ఉపాధ్యక్షుడిగా ఐ.చంద్ర ప్రసాద్ ,ప్రధాన కార్యదర్శిగా పి.నాగ చంద్రబాబు, సహ కార్యదర్శి వి.జోషి, కోశాధికారిగా పి.తేజస్వి, కమిటీ మెంబర్లుగా పి .సురేష్, జి.సుజిత్ ఎన్నికకాబడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లాఓ ఉద్యోగులు పాల్గొన్నారు. పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడును కలసి వినతిపత్రం అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి మీ ఉద్యోగాలు పోలేదని కాంట్రాక్టర్ మారిన వెంటనే అందర్నీ విధుల్లోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఇంటర్ పరీక్షకు 53 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

ఇంటర్ మొదటి సంవత్సరం జూవాలజీ , మాథ్స్ 1(బి), హిస్టరీ, ఒకేషనల్ పరీక్షకు సంబంధించి 53మంది గైర్హాజరయ్యారని పరీక్షల కస్టోడియన్ అధికారి డి.విజయ కుమార్ శనివారం తెలిపారు. రాష్ట్ర వ్యాప్త పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం పరీక్షకు మండలంలోని డాక్టర్ మోకా గణపతి రావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తార జూనియర్ కళాశాల, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన మొత్తం 670 మంది పరీక్షలు రాయవలసి ఉండగా 617 మంది మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. 53మంది గైర్హాజరయ్యారన్నారు. డాక్టర్ ఎంజిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 112మందికి 107 మంది హాజరు కాగా 5గురు , తార కళాశాలలో 194 మందికి 184 మంది హాజరు కాగా 10మంది, గురుకుల పాఠశాలలో 209మందికి గాను 197 మంది హాజరు కాగా 12 మంది గైర్హాజరయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన పరీక్షకు 155మందికి 129 మంది హాజరు కాగా 26మంది గర్హజరైనట్లు కస్టోడియన్ తెలిపారు.




గేట్ మీటింగ్‌లో పాల్గొన్న కార్మికులు

ఆర్‌టిసి డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం డిపో మేనేజర్ డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని శనివారం డిపో ఎదురుగా నేషనల్ మజ్దూర్ యూనియన్, యునైటెడ్ వర్కర్స్ యూనియన్ సంయుక్తంగా గేట్ మీటింగ్ నిర్వహించారు. డ్రైవర్ కేజీ రావును బలవంతంగా టిమ్ డ్యూటీలకు పంపడం మానుకోవాలని, డ్రైవర్ బిఎస్.నారాయణ పై విధించిన అక్రమ సస్పెన్షన్ ఎత్తివేయాలని గేట్ మీటింగ్ నందు కార్మికుల నినాదాలు చేశారు. ఒక పక్క సిఎం చంద్రబాబు ఉద్యోగుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని చెబుతుంటే, మరో ప్రక్క అమలాపురం డిపోలోని డిపో మేనేజర్, సిఐ మేడం కార్మికులను వేధింపులకు, కక్ష సాధింపులకు గురి చేయటం ఎంతవరకు సమంజసం అని యునైటెడ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి.గణపతిరావు ప్రశ్నించారు. కార్మికులను వేధించడం మానుకోవాలని, డిపోలో మంచినీటి, రెస్ట్ రూమ్ సౌకర్యం మెరుగుపరచాలని కార్మికులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని నేషనల్ మజ్దూర్ డిపో కార్యదర్శి పి. మణి రాజు పేర్కొన్నారు. డిపో మేనేజర్ తమ వైఖరి మార్చుకునేంత వరకు ఈ ఉద్యమం కొనసాగుతుందని నాయకులు పిలుపునిచ్చారు. రెండు యూనియన్ల కార్మికులు అత్యధిక సంఖ్యలో గేట్ మీటింగ్ నందు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



కరెన్సీ విలువల్లో దూసుకు పోతున్న బిట్ కాయిన్స్

డాలర్ ని మించిపోయిన బిట్ కాయిన్ విలువ


ఘనంగా మహిళా దినోత్సవం



రాజోలు కోర్టు ప్రాంగంలో మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న కొత్తపేట ఎంఎల్ఎ సత్యానందరావు



అమలాపురంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలోఅంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఘనంగా నిర్వహించారు.

అమలాపురం: మహిళా సాధికారత తోనే స్వర్ణాంధ్ర-2047 సాధ్య పడుతుందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కె.అచ్చెన్ననాయుడు అన్నారు. జిల్లా స్థాయిలో స్థానిక సత్యనారాయణ గార్డెన్స్‌లో మహిళా దినోత్సవాన్ని నిర్వ హించారు. కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్, ప్రభుత్వ విప్ ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు, అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు, ఎంఎల్‌సి బి.ఇజ్రాయిల్, జెసి టి.నిషాంతి తదితరులు మాట్లాడారు. ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహిళా సాధికారత, సమాన హక్కుల సాధన కోసం సమిష్టిగా ఉద్యమించాలన్నారు. పలువురు లబ్ధిదారులకు రుణాలను అందజేశారు. విశిష్ట సేవలు అందించిన పలువురిని సత్కరించారు. అనంతరం అక్క ఏర్పాటు చేసిన స్టాల్స్ ను మంత్రులు, అధికారులు పరిశీలించారు. కార్య క్రమంలో ఎస్‌పి బి.కృష్ణారావు, ఎంఎల్‌సి కె.సూర్యనారాయణ రావు, కొత్తపేట ఎంఎల్ఎ బి.సత్యానందరావు, అముడ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, మెట్ల రమణ బాబు, డిఆర్ఒ రాజకుమారి, ఐసిడిఎస్ పీడీ శాంతి కుమారి డిఆర్‌డిఎ పీడీ శివశంకర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** మహిళాదినోత్సవం సందర్భంగా పుల్లేటికుర్రు బ్యాంకు ఆవరణలో డ్వాక్రా యానిమేటర్ లను చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రాఘవేంద్రసన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమైక్య ఇన్‌ఛార్జ్ ఎపిఎం కె.శ్రీనివాస్,అకౌంటెంట్ కె.సూర్యకుమారి, విఒఎలు, యానిమేటర్లు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం:** గ్రామాలలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. వైసిపి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజ కుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపిపి దంగేటి వీర అచ్యుత జానకి రాంబాబు మహిళా దినోత్సవ కేక్ ను కట్ చేశారు. వైసిపి రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, డాక్టర్ వైఎస్‌ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి సాదే శ్రీను, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు, సర్పంచ్ లు పెయ్యల రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. **కొత్తపేట:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకల్లో ఎంఎల్ఎ బండారు సత్యానందరావు పాల్గొన్నారు. అనంతరం నియోజకవర్గంలో పలు ప్రభుత్వ, ఇతర కార్యాలయాల్లో సేవలు అందిస్తున్న మహిళలను సత్కరించారు. కార్యక్ర మంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** బండారులంక గ్రామపంచాయతీ వద్ద మహిళా దినోత్సవ కార్యక్రమం సర్పంచ్ పెనుమాల సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో విశిష్టంగా శ్రద్ధ, బాధ్యతలతో పనిచేస్తున్న గ్రామ ఉద్యోగులను గుర్తించి వారికి చిరు కానుకలు సర్పంచ్ చేతుల మీదుగా అందజేసి వారిని సత్కరించారు. కార్యక్రమంలో మాడా మాధవి, ఎఎన్ఎం లు, డ్వాక్రా విఒలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్స్, సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. భట్నవిల్లి గ్రామపంచాయతీ సమావేశపుహాలులో సర్పంచ్ తిరుకోటి సుజాత ఆధ్వర్యంలో జరిగిన సమా వేశానికి అధ్యక్షత వహించిన మాతా రమాబాయి అంబేద్కర్ ఫౌండేషన్ చైర్ పర్సన్ పుణ్యమంతుల రజని పాల్గొని మాట్లాడారు. అనంతరం తొలి మహిళా శతావధాని ఆకెళ్ళ బాలభాను, తొలి మహిళా ఉపాధ్యాయురాలు మోసుగంటి లక్ష్మీ సత్యవతి మహేశ్వర రావు, తొలి తెలుగు ఉపాధ్యాయురాలు తొత్తరమూడి వరలక్ష్మి కపావరం, తొలి మహిళా సర్పంచ్ ఇళ్ల లక్ష్మీ సత్యవతి, రెండవ, మూడవ మహిళా సర్పంచులైన నేదునూరి పెద్దింట్లమ్మ తదితరులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో మహిళలు, ఫౌండేషన్ సభ్యులు, సచివాలయ మహిళా సిబ్బంది, గ్రామ పెద్దలు ఇళ్ల శివరాం, వార్డు మెంబర్ పండు సత్తిబాబు, గుత్తాల వెంకటేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **ఐ.పోలవరం:** పాతఇంజరం గ్రామపంచాయతీలో మహిళా దినోత్సవ సభను మహిళా పోలీస్ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించారు. పంచాయితీ కార్యదర్శి పోతుల సూర్య, వెటర్నరీ అసిస్టెంట్ విజయలక్ష్మి ఏఎన్ఎం అనంతలక్ష్మి , గ్రామంలో ఉన్న మహిళా సిబ్బంది, గ్రామ వార్డు సభ్యులు పాల్గొ న్నారు. **మండపేట:** స్థానిక పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యురాలు డాక్టర్ బిక్కిన పద్మ, డాక్టర్ ఇమ్మిడిశెట్టి జ్యోతిర్మయిలను కమ్యూనిటీ పారామెడిక్స్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్యర్యంలో జిల్లా పిఎంపి అధ్యక్షులు కోన సత్యనారాయణ సత్క రించారు. కార్యక్రమంలో మండల పిఎంపి అసోసియేషన్ నాయకులు బల్లా వెంకట రమణ, ఇరవాడ రవికుమార్, వానపల్లి కనకరాజు, మారిశెట్టి సత్యనారాయణ, మండిపూడి చంద్రశేఖర్, పుత్సలకాశీ, తదితరులు పాల్గొన్నారు. **రాజోలు:** స్థానిక కోర్టు ప్రాంగణంలో మహిళా దినోత్సవం లీగల్ ఎయిడ్ కౌన్సిలర్ జి.రజిత అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి సీనియర్, జూనియర్ సివిల్ జడ్జి లు ప్రమీల రాణి,కె.హిమ బిందు ముఖ్య అతిథులుగా పాల్గొని మహిళా దినోత్సవ కేక్ కట్ చేశారు. సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల రాణి ప్రసంగిచారు. కార్యక్రమంలో మహిళా న్యాయవాదుల మైలవరపు శ్రీదేవి, సిహెచ్.ఉమాలక్ష్మి, ప్రియా బాంధవి, ఆదిలక్ష్మి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడిశెట్టి సాయిబాబా, వైఎస్ఎస్,అయ్యప్ప నాయుడు, మైఖేల్, శేషగిరిరావు, జెహెచ్.సాగర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ఆలమూరు**: మండల కేంద్రమైన ఆలమూరులో సమత మహిళా పొదుపు సంఘం ఆధ్వర్యంలో భూపతి సుమతి అధ్యక్షతన మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహిం చారు. ఎపి మహిళా సమాఖ్య నాయకురాలు అక్కినేని వనజ, ఛైర్‌పర్సన్ సమత మార్ట్స్ గండి పద్మ, గ్రామ సర్పంచ్ నాతి లావణ్య కుమార్ రాజా, ఎఐటియుసి నాయకులు కే.సత్తిబాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు టి.మధు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి డేగా ప్రభాకర్ రావు, జన విజ్ఞాన వేదిక పూర్వ అధ్యక్షులు చల్లా రవికుమార్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎజిపి బూసి విద్యా ప్రసన్న, వైస్ ఎంపిపి వాసంశెట్టి దుర్గాభవాని, కె.రామకష్ణ, వి.శామ్యూల్, ఎంపిటిసి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు. **మామిడికుదురు**: మండల పరిషత్ కార్యాలయంలో మహిళా ప్రజాప్రతినిధులకు, మహిళా ఉద్యోగులకు మండల పరిషత్తు ఉద్యోగులు శాలువా కప్పి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలి పారు. కార్యక్రమంలో ఎంపిపి కుసుమ వనజ కుమారి, ఎంపిడిఒ కె.వెంకటేశ్వరరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** :అద్దంకి వారి లంక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆలమూరు శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఒ ఎ.గజలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉమెన్స్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శ్రమ కోఆర్డినేటర్ బి.నాగేశ్వరి సేవలను గుర్తించి సిడిపిఒ గజలక్ష్మి శాలువాలు కప్పి మెమెంటోల సన్మానించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు ఐ.మాణిక్యం, పి. వెంకటలక్ష్మి, శ్రమ సంస్థ సభ్యులు వై రమణయ్య, ఎన్.శారద, ఎంభవాని, ఎం నాగరాజు తదితరులు పాల్గొన్నారు. **ముమ్మిడివరం:** స్థానిక పోలీసు స్టేషన్ నందు సర్కిల్ పరిధిలో వివిధ పోలీసు స్టేషన్లలో పని చేస్తున్న మహిళా పోలీసు సిబ్బందిని మహిళా దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం సిఐ ఎం మోహన్ కుమార్ ఘనంగా సత్కరించారు. ముమ్మిడివరం ఎస్ ఐ జ్వాలా సాగర్, కాట్రేనికోన, ఐ.పోలవరం ఎస్ఐలు అవినాష్, మల్లిఖార్జున్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **అయినవిల్లి**: మహిళా దినోత్సవం సందర్భంగా విలస గ్రామపంచాయతీ నందు సర్పంచ్ కుసుమ లిల్లీ మంగేష్కర్, సునీల్ అధ్యక్షతన కేక్ కట్ చేశారు. పంచాయతీ సిబ్బందికి చీరలు, స్వీట్ బాక్స్ అందించి సత్కరించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచా యతీ సెక్రెటరీ ధనలక్ష్మి, పంచాయతీ సిబ్బంది,హెల్త్ డిపార్ట్మెంట్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



పంచాయతీ సిబ్బందిని సత్కరిస్తున్న విలస సర్పంచ్



మండపేటలో డాక్టర్ జ్యోతిర్మయిని సత్కరిస్తున్న పిఎంపి లు



ఉప్పలగుప్తంలో కేక్ కట్ చేస్తున్న ఎంపిపి జానకి రాంబాబు,గిరిజకుమారి



పుల్లేటికుర్రులో డ్వాక్రా యానిమేటర్లకు సన్మానం



మామిడికుదురులో మహిళా ప్రజాప్రతినిధులకు సత్కారం



అద్దంకివారిలంకలో కోఆర్డినేటర్ నాగేశ్వరిని సన్మానిస్తున్న సిడిపిఒ గజలక్ష్మి



ఆలమూరులో మాట్లాడుతున్న ఎజిపి విద్యా ప్రసన్న



బట్నవిల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న రజని



మహిళలను సత్కరిస్తున్న ముమ్మిడివరం సి ఐ

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని ఇంజరం సమీపంలోని యానాం - ద్రాక్షారామ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థి తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు...కాకినాడ ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ద్విచక్ర వాహనంపై వెళ్తే క్రమంలో వారి వద్ద మద్యం సీసాలు ఉన్నాయి. దీంతో సంకరపాలెం ఎక్సైజ్ సిబ్బంది విద్యార్థులను వెంబడించారు. దీంతో ఆ విద్యార్థులు వారి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనం వేగాన్ని పెంచారు. ఈ నేపథ్యంలోనే ద్రాక్షారామ వైపు నుంచి వస్తున్న లారీని విద్యార్థులు ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరప మండలం అడవిపూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్ (21) తీవ్ర గాయాలపాలై అపస్మారక స్థితికి చేరుకోవడంతో స్థానికులు కాకినాడ జిజిహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. మరో విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఎక్సైజ్ పోలీసులు విద్యార్థులను వెంబడించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని విద్యార్థి కుటుంబ సభ్యులు, స్థానికులు సంకరపాలెం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ ను ముట్టడించారు. దీంతో ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సంఘటనా స్థలానికి కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణ, స్థానిక నాయకులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేస్తున్నారు.

వివాహితపై కత్తితో దాడి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

వివాహిత మహిళపై ఒక వ్యక్తి కత్తి తో దాడి చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని అనాతవరం గ్రామ ఎదురుమూడి పుంత గ్రామానికి చెందిన పంతగంటి జయ రామకృష్ణ తమ పక్కింటిలో నివాసముంటున్న మాలతి పై శనివారం కత్తితో దాడి చేశాడు. జయ రామకృష్ణ భార్య ఉపాధి నిమిత్తం గల్ఫ్ ఉంటోంది. అతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మాలతికి భర్త కుమారుడు, కుమార్తె ఉన్నారు. శనివారం మధ్యాహ్నం మాలతి ఇంటి నుండి బయటకు వెళుతున్న సమయంలో ఆ చుట్టుపక్కల పిల్లలు ఆటలాడుకుంటుండగా ఆమె వారిని మందలించింది. ఆ సమయంలో ఇంట్లో ఉన్న జయ రామకృష్ణ కోపంతో కత్తితో మాలతిపై దాడి చేశాడు. దాడికి గురైన మాలతి అపస్మారక స్థితికి చేరడంతో ఆమెకు అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముమ్మిడివరం సిఐ ఎం.మోహన్ కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - ఆలమూరు

మద్యం మత్తులో వాహనం నడుపుతున్న వ్యక్తిని అరెస్టు చేసి శనివారం కోర్టులో హాజరు పరచగా జడ్జి నెల రోజులు జైలు శిక్ష విధించారు. సాధారణ వాహన తనిఖీలలో భాగంగా మండలంలోని చెముడులంకకు చెందిన మజ్జి రాజు మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని ఆలమూరు ఎస్ఐ ఎం.అశోక్ తెలిపారు. దీంతో అతనిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచామన్నారు. జడ్జి వి.నాగేశ్వరరావు నాయక్ నిందితుడు రాజుకు నెల రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...స్థానిక బాలుర హైస్కూల్ వద్ద పట్టణానికి చెందిన విత్తనాల దొంగ అబ్బాయి కల్లు గీసుకుని వస్తుండగా కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను గాయాలపాలయ్యాడు. వైద్యం నిమిత్తం పిఠాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

మిల్క్ బాయిలర్స్ ఆందోళన విరమణ

ప్రజాశక్తి - యానాం

వివిధ ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మిల్క్ బాయిలర్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కారం కోరుతూ పుదుచ్చేరి వ్యాప్తంగా చేపట్టిన ఆందోళన శనివారం సాయంత్రం విరమించారు. పుదుచ్చేరి విద్యాశాఖ ఉన్నతాధికారులు రూ.10 వేలు నుంచి రూ.18 వేల వేతనాలు త్వరలో పెంచుతామని హామీ ఇవ్వడంతో దీక్షను విరమించారు. దీక్షా శిబిరాన్ని న్యాయవాదులు సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం ఆందోళనకారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు.

రూ.5.35 కోట్లతో రహదారుల నిర్మాణం

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండలంలో రూ.5.35 కోట్లతో రహదారుల నిర్మాణాలను చేపడుతున్నట్లు జిల్లా పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఎవి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన సింహాద్రిపురం, భూపాలపట్నం, వీరవరం గ్రామాలకు చెందిన రహదారి పనుల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ పనుల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని అన్నారు. ఈ పర్యటనలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు డి.ఉమాశంకర్, నారాయణ, కాంట్రాక్టర్ రమేష్ సిద్ధు పాల్గొన్నారు.

మండలంలో పి4 సర్వే ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండల పరిధిలోని 23 గ్రామాల్లో శనివారం పి-4 సర్వే ప్రారంభమైందని ఎంపిడిఒ డి.శ్రీ లలిత తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ పీపుల్, పబ్లిక్, ప్రయివేట్ పార్టనర్ షిప్ తో పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధి నిర్దేశించిన ఈ సర్వేను సచివాలయ సిబ్బంది వారం రోజులపాటు నిర్వహిస్తున్నారు. 27 ప్రశ్నలతో కూడిన ఈ సర్వే ద్వారా ప్రతి కుటుంబం ఆర్థిక స్థితిగతులు, జీవన ప్రమాణాలు నమోదు చేస్తారన్నారు. పేద కుటుంబాలను గుర్తించి పైనుంచి 20 శాతం కుటుంబాలను ఎంపిక చేసి ప్రతి ఏడాది వారి ఆర్థిక స్థితిగతులను 20 శాతం పెరిగేందుకు పారిశ్రామికవేత్తలు, వ్యాపారస్తులు, డాక్టర్లు, ఇంజనీర్లు వంటి వారి సహాయ సహకారాలతో కృషి జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలపై చైతన్యం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

స్థానిక సమస్యలపై ప్రజలను చైతన్యం చేసేందుకు సిపిఎం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ప్రజా చైతన్య యాత్రలను ప్రారంభించింది. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో జరిగిన ప్రజా చైతన్య యాత్రలో స్వయంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు ఆ మండలంలో పలుగ్రామాల్లో సైకిల్ యాత్ర నిర్వహించారు. స్థానిక సమస్యలపై అధ్యయనం చేస్తూ... ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తూ... పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా సిపిఎం బృందం వద్దకు వచ్చి సమస్యలను ఏకరువు పెట్టారు. పలుచోట్ల స్థానికులు వినతిపత్రాల రూపంలో వారి సమస్యలను బృందం దృష్టికి తీసుకెళ్లారు. అనుకున్న దానికంటే ప్రజల నుంచి ఈ యాత్రలకు అనూహ్య స్పందన వచ్చింది. సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నా, ఓట్లకు మాత్రమే తమను వినియోగించుకుంటున్నారని, ఆపై గాలికొదిలేస్తున్నారని పాలకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేయడం కనిపించింది. కనీసం తాగునీరు కూడా అందించని స్థితిలో ప్రభుత్వం ఉందని పలువురు వాపోయారు. మొత్తంగా స్థానిక సమస్యలపై ఉద్యమానికి సిద్ధపడాలని ఆయన పిలుపునిచ్చారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో శనివారం నుంచి ప్రజా చైతన్య యాత్ర ప్రారంభమైంది. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఆధ్వర్యంలో సిపిఎం నాయకుల బృందం పలు ప్రాంతాల్లో పర్యటించింది. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంది.

మరో పక్క కూటమి ప్రభుత్వం తన గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తోంది. సమస్యల పరిష్కారంకోసం పోరాటాలకు దిగిన వారిపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ వారంలో జరిగిన ఆశాల నిర్బంధమే దీనికి నిదర్శనం. పని ఒత్తిడి తగ్గించాలని, కనీస వేతనం ఇవ్వాలని, ఉద్యోగ విరమణ ప్రయోజనాలను అందించాలని తదితర డిమాండ్లతో వారి వర్కర్స్ యూనియన్ 'చలో విజయవాడ'కు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా ఉమ్మడి జిల్లా నుంచి విజయవాడకు సొంత ఖర్చులతో బయలుదేరిన ఆశాలను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. మహిళలని కూడా చూడకుండా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. గత సర్కారు ఇదే విధానాలను అవలంబిస్తే వ్యతిరేకించిన కూటమి నాయకులు, ఇప్పుడు వారే పాలకులుగా ఉండి అరెస్టులు చేయించడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

రబీ సాగుకు నీటి గండం

రబీ సాగుకు నీటిగండం మొదలైంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావటంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాలలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విధితమే. బహుళార్థక సాధక ప్రాజెక్టు అయిన పోలవరం పూర్తి చేస్తామంటూ ఇప్పటికి రెండు వాయిదాలు వేసింది. జాతీయ ప్రాజెక్టు నిర్మాణానికి పూర్తి స్థాయి నిధులు కేటాయించాలనికేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీని ప్రశ్నించలేని అసమర్థతను వైసిపి ఆత్మవిమర్శ చేసుకోవాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ప్రతి ఏటా వేసవి పనులు నిర్వహించి కాల్వల ఆధునీకరణ, తూటు కాట తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనవాయితీగా వస్తోంది. డ్రెడ్జింగ్ పనులు, పంట కాల్వల పూడిక తీత పనులు రాష్ట్ర ప్రభుత్వం అటకెక్కించింది. వ్యవసాయ రంగంలో కీలకమైన నీటి వనరులు నిల్వ చేసుకోవాలనే ముదుచూపు లేకపోవటం విమర్శలకు దారితీస్తోంది. తాజాగా వంతుల వారీ విధానంతో నీరు శివారు పొలాలకు చేరక రైతులు ఆందోళన చెందుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కాల్వల ఆధునీకరణ చేపట్టాలి. ఇప్పటికే సాగునీటి కోసం కాకినాడ జిల్లా తాళ్లరేవులో రైతులు రోడ్డెక్కారు. ప్రభుత్వం స్పందించకుంటే మిగిలిన ప్రాంతాల్లోనే ఇదే పరిస్థితి తలెత్తే ప్రమాదం ఉంది.



వేసవి ఉష్ణోగ్రతలు జిల్లా వాసులను ఠారెత్తిస్తున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సరాసరిన 38 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతున్నాయి. రాజమహేంద్రవరం, కాకినాడ, అమలాపురం జిల్లా కేంద్రాలతో పాటు ఇతర పట్టనాలు, పల్లెల్లో సైతం వడగాడ్పులు పెరుగుతున్నాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ముఖ్య కూడళ్లు వెలవెలబోతున్నాయి. రానున్న కాలంలో ఎండల తీవ్రత మరింత పెరగుతుందనే వాతావరణ శాఖ హెచ్చరికలు ప్రజలను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.



ప్రజాదర్బార్‌లో వినతులు స్వీకరిస్తున్న ఎంఎల్‌ఎ సత్యానందరావు

సమస్యలను త్వరగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - రావులపాలెం

ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు చేపట్టాలని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. శనివారం మండలపరిధి పొడగట్లపల్లిలో ఎంఎల్ఎ సత్యానందరావు ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలను ఎంఎల్ఎ స్వీకరించారు.ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం కూడా దీనిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. అధికారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం రూ.82 లక్షలతో పొడగట్లపల్లి కుక్కల కోడు నుంచి గోపాలపురం ప్రధాన పంటకాలువ వరకు నిర్మాణం చేపడుతున్న రోడ్డు పనులను ఎంఎల్ఎ పరిశీలించి రోడ్డు నాణ్యత ప్రమాణాలతో నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధానకార్యదర్శి ఆకుల రామకృష్ణ, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చిలువూరి సతీష్ రాజు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, మైగాపుల గురయ్యానాయుడు, కాసా సాగర్, మాసాబత్తుల ఆనందరావు, అల్లూరి రామకృష్ణంరాజు, గోపిశెట్టి సత్తిబాబు, బండారు శ్రీనివాస్, ఆర్అండ్‌బి అధికారులు, పంచాయతీ కార్యదర్శి శుభాకర్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తపేట: మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఎపి కార్యక్రమంలో భాగంగా గంటి, పొడగట్లపల్లి గ్రామాలలో అభివృద్ధి పనులకు కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానందరావు శనివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ పాల్గొన్న కార్యక్రమంలో ఎంఎల్ఎ మాట్లాడుతూ కొత్తపేట మండలం గంటి గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.50 లకలు, అలాగే రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మతుల నిమిత్తం రూ.82 లక్ష లు మంజూరు అయినట్లు తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్ఎ సత్యానందరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాడపల్లికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - ఆత్రేయపురం



యాత్రికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆలయ సిబ్బంది

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం యాత్రికులు పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజనం మంత్రపుష్పం, తొలి హారతి తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం యాత్రికులకు దర్శనాలు కల్పించారు. శనివారం సెలవు దినం కావడంతో ఆలయ అధికారులు అంచనాలకుమించి యాత్రికులు రావడంతో ఆలయ ప్రాంగణం అంతా కిక్కిరిసిపోయింది. ఆలయానికి వచ్చే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి పర్యవేక్షించారు. క్యూలైన్లో యాత్రికులకు ఇబ్బందులు తలెత్తకుండా మంచినీటి సౌకర్యం, చల్లని మజ్జిగ, బిస్కెట్లను పంపిణీ చేశారు, సుమారు లక్ష వరకు యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎస్.రాము పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారికి వివిధ సేవలు , విరాళాలు రూ.52,61,475 సమకూరినట్లు ఆలయ డిసి తెలిపారు.

బాల బాలాజీ స్వామి ఆదాయం రూ.3.36 లక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ దేవస్థానమునకు వివిధ విభాగాల ద్వారా శనివారం రూ.3,36,594 లు ఆదాయం సమకూరిందని ఎం.సత్యనారాయణ రాజు తెలిపారు. ఇందులో శాశ్వత నిత్యాన్నదాన ట్రస్టు కు రూ.ఐదు వేలు ఆదాయం రాగా, నిత్య అన్నదాన ట్రస్ట్ కు రూ.77,414రూ లు ఆదాయం సమకూరిందన్నారు 5 వేలు మంది యాత్రికులు స్వామి వారిని దర్శనం చేసుకోగా, 3 వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు అన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

ప్రజాశక్తి - ముమ్మిడివరం

కక్షి దారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ల ముఖ్య ఉద్దేశ్యం అని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మరియు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా అన్నారు. జాతీయ లోక్ అదాలత్ లో భాగంగా శనివారం స్థానిక కోర్టు ప్రాంగణంలో జరిగిన లోక్ అదాలత్ లో 328 కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించారు.వీటిలో 4 ఇపి కేసుల ద్వారా రూ.2,23,328, 5 ఒ.ఎస్‌మని కేసుల ద్వారా రూ.12 లక్షల 90 వేలు, ఒక ఒఎస్ టైటిల్మరియు ఎంసి కేసు ద్వారా రూ.2 లక్షలు, డివిసి, ఎన్ఐ యాక్ట్ 5 కేసుల ద్వారా రూ.12 లక్షల 73 వేలు, ఐపిసి సిసి 56 కేసులు ద్వారా రూ.3 లక్షల 14 వేలు, ఎక్సయిజ్ కేసులు 224 ద్వారా రూ.17లక్షలు 95 వేలు, బ్యాంకు కేసులు12 ద్వారా రూ.5 లక్షల 41 వేలు, బిఎస్ఎన్ఎల్ కేసులు 13 ద్వారా రూ.12 వేల 468, బెంచి కోర్టు ఐపిసి సిసి1, అడ్మిషన్ 5 కేసులు ద్వారా రూ.20 వేలు మొత్తం అపరాధ రుసుము రూ.56,69,147 వసూళ్లు చేసినట్లు మేజిస్ట్రేట్ తెలిపారు. ఈ అదాలత్ లో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి సత్యనారాయణ ఎజిపి టి.శాంతిసుధ, అడ్వకేట్స్ కెఎల్‌వి.ప్రసాద రావు, గ్రంధి రామారావు, జి.శ్రీని వాసరావు, ఎం.వెంకటేశ్వరరావు, ఎండి అలీ హసన్, వలియా బాబా, వెంకట్రావ్ నరేష్, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు తదితరులు పాల్గొన్నారు.



ముమ్మిడివరం కోర్టులో లోక్ అదాలత్


147 కేసులు పరిష్కారం

రాజోలు: రాజోలు న్యాయ సముదాయాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ ద్వారా 147 కేసులు పరిష్కారం అయ్యినట్లు సీనియర్ ,జూనియర్ సివిల్ జడ్జిలు ప్రమీల రాణి, హిమబిందు తెలిపారు. సివిల్ 11 కేసులకు గాను రూ.21.47 లక్షలు, క్రిమినల్ 111 కేసులకు గాను రూ.7.35 లక్షలు, పి ఎల్‌సి 25 కేసులకు గాను రూ.12.97 లక్షలు మొత్తం 147 కేసులకు గాను రూ.41,80172 ఆర్థిక ల్తాదేవీలు పరిష్కారం అయ్యాయని తెలిపారు. మొదటి బెంచ్ సభ్యులుగా సీనియర్ సివిల్ జడ్జి ప్రమీల రాణి, లోక్ అదాలత్ సభ్యుడు జెహెచ్.సాగర్, రెండవ బెంచ్ సభ్యులుగా జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు, ప్యానల్ లాయర్ జి.రజిత వ్యవహరించారు.

సిఎం సహాయ నిధి చెక్కుల అందజేత

ప్రజాశక్తి - రాజోలు

నియోజకవర్గ పరిధిలోని సిఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు శనివారం మలికిపురంలోని ఎంఎల్ఎ కార్యాలయంలో చెక్కులను రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ అందజేశారు.. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారంగా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో 22 మంది లబ్దిదారులకుగానూ రూ.30,91,395 విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. చెక్కులు అందుకున్న వారు మాట్లాడుతూ వైద్య సహాయం కోసం సిఎం చంద్రబాబు అందించిన నిధులు తమకు అందేలా కృషి చేసిన ఎంఎల్ఎ దేవ వరప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జనసేన, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - అంబాజీపేట



మండల వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని మహిళలకు అనేక హామీలు ఇచ్చిన సిఎం చంద్రబాబు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మహిళలను మోసం చేస్తూ దుష్ట పరిపాలన సాగిస్తుందని వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఎద్దేవా చేశారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా అంబాజీపేటలో మండల వైసిపి అధ్యక్షుడు విత్తనాల ఇంద్ర శేఖర్ అధ్యక్షతన మండల పార్టీ స్థాయి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పి.గన్నవరం నియోజకవర్గం వైసిపి కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాధినేత వైఎస్.జగన్ రాష్ట్రంలోని మహిళల అభివృద్ధిని ఆకాంక్షించి ప్రత్యేకంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తే ప్రస్తుత సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ప్రభుత్వంలో మహిళలపై అన్యాయాలు అత్యాచారాలు అక్రమాలు ఎక్కువైనా పట్టించుకోవడంలేదని విమర్శించారు. అదేవిధంగా గత ప్రభుత్వంలో విద్యార్థులకు అమ్మఒడి విద్యాదేవన వసతి దీవెన ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరిట విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తే ఈ ప్రభుత్వం ఆ హామీలను నెరవేర్చకుండా తుంగలో తొక్కిందని అన్నారు . ఈనెల 12న వైసిపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పార్టీ అధినేత వైఎస్ జగన్ పిలుపుమేరకు యువత పోరు పేరిట కార్యక్రమం తలపెట్టామన్నారు. ఆ రోజున అమలాపురం కలెక్టరేట్ కార్యాలయం నందు విద్యార్థులు తల్లిదండ్రుల తరపున పోరాటం చేయడానికి శ్రీకారం చుడుతున్నామని గన్నవరపు శ్రీనివాస్ విలేకరుల కు తెలియజేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంఎల్‌ఎ పాముల రాజేశ్వరి దేవి, రాష్ట్ర అధికార ప్రతినిధి చెల్లుబోయిన శ్రీనివాస్, కుడుపూడి భారత్ భూషణ్, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, జడ్‌పిటిసి సభ్యురాలు బూడిద వరలక్ష్మి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొమ్మేటి సత్యమోహన్, ఎంపిటిసి సమైక్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, పలువురు నాయకులుచ కార్యకర్తలు పాల్గొన్నారు..

నియోజకవర్గాల వారీగా కుట్టు శిక్షణా కేంద్రాలు

ప్రజాశక్తి - అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్క రించుకొని నియోజక వర్గాల వారీగా కుట్టు శిక్షణా కేంద్రాలను ప్రారంభించిందని ఎంఎల్ఎ అయితా బత్తుల ఆనందరావు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక కోనసీమ మహిళా సమైక్య కార్యాలయం నందు కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ కాళ్లపై తమ నిలబడి జీవనోపాదులు పొందుతూ కుటుంబాలను పోషించుకునే స్థాయికి చేరుకోవాలని సంకల్పం తో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించిందన్నారు. 90 రోజులు శిక్షణ అనంతరం 75 శాతం హాజరు ఉన్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లు అందిస్తా రని అన్నారు. కుట్టు శిక్షణలో ఏ మేరకు శిక్షణ పొందింది పరీక్షలు కూడా నిర్వహి స్తూ వారి సామర్థ్యాలను పరిగణనలో తీసుకొని వారికి అవసరమైన మల్టీపర్పస్ కుట్టుమిషన్లు కూడా అందించేందుకు దశలవారీగా చర్యలు చేపట్టనుందన్నారు. బిసి సంక్షేమం సహకార సంఘాల ఆధ్వర్యంలో ఆర్య, వైశ్య, రెడ్డి, క్షత్రియ, కమ్మ, బ్రాహ్మణ, సామాజిక వర్గాలలో వెనుకబడిన వర్గాల మహిళలను ఎంపిక చేసి నిష్ణాతులైన వారితో శిక్షణ కార్యక్రమాలు నియోజక వర్గాల వారీగా నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 3243 మంది మహిళలకు శిక్షణను ఇవ్వాలని ప్రభుత్వ లక్ష్యంగా నిర్దేశించిందన్నారు ఈ మేరకు చర్యలు వేగవంతం చేయాలని ఆయన అధికారులకు సూచిం చారు.ఈ కార్యక్రమంలో బిసి వెల్ఫేర్ ఆఫీసర్ రమేష్, అమ్ముడా ఛైర్మన్ అల్లాడ స్వామి నాయు డు, మెట్ల రమణబాబు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ఆనందరావు

పౌష్టికాహారంపై అవగాహన

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చిన జగ్గంపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింత తల్లుల ఆరోగ్యంపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఐసిడిఎస్ ద్వారా సరఫరా అవుతున్న పౌష్టికాహార పదార్థాలను, హోం రేషన్ పరిశీలించి రక్తహీనత, మాల్ న్యూట్రిషన్ మీద అర్నెస్ ఇచ్చి ప్రసవ ప్రణాళిక సురక్షిత ప్రసవం ప్రసూతి జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

అనాథ మృతుని పేరిట అన్నదానం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందిన అనాథ కిర్లంపూడి సూర్యనారాయణ పేరిట వివేకానంద సేవా సమితి సభ్యులు శనివారం ఆసుపత్రి ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి ఛైర్మన్ మైరాల నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కో ఛైర్మన్‌లు జొన్నాడ వీరబాబు, వాగు రాజేష్, స్థానిక నాయకులు బుగత శ్రీను, సామంతుల గోపి పాల్గొన్నారు.